కరకట్ట నిర్మాణంతోనే రక్షణ


భూమి కొట్టుకుపోవడంతో తేలిన రాళ్లు(ఫైల్)


చేనులో ఇసుక మేటలు(ఫైల్)

- కోతకు గురవుతున్న గోదావరి
- మండలానికి పొంచి ఉన్న ముప్పు
- పంటలు నష్టపోతున్న రైతులు

వాజేడు: గోదావరి రైతుల పాలిట శాపంగా మారింది. ప్రతీ ఏడాది వచ్చే వరదల కారణంగా కోతకు గురి అవుతుండటంతో రైతుల భూములను వరదలో కలిసి పోతున్నాయి. దీంతో రైతుల పేరుపై పట్టాలు ఉన్నప్పటికీ సాగు చేసుకునే భూములు కానరావడం లేదు. చేలు, పొలాలు గోదావరి వరదలకు మునిగి పోయి ఇసుక మాత్రమే మిగులుతోంది. మండల పరిధిలోని లొట్టిపిట్ట గండి నుంచి ఏడ్జర్లపల్లి వరకు మండల వ్యాప్తంగా గోదావరి పరివాహకం వెంట వందలాది ఎకరాల భూములు కోతకు గురైనట్లు రైతులు తెలుపుతున్నారు.

పొంచి ఉన్న ముప్పు

వాజేడు మండలానికి గోదావరి నుంచి వరద ముప్పు పొంచి ఉంది. తుపాకుల గూడెం వద్ద నిర్మించిన బ్యారేజి ఎగువ ప్రాంతంలో ఉండడంతో వర్షాకాలంలో దిగువకు విడుదల చేసే వరద నీరు మూలంగా మండల పరిధిలోని చంద్రుపట్ల, టేకుల గూడెం, పేరూరు ఇలా పలు గ్రామాల సరిహద్దుల్లో భూములు, ఒడ్డు కోతకు గురవుతున్నాయి. కంతెనపల్లి, చింతూరు గ్రామల మధ్య నుంచి నేరుగా వచ్చిన గోదావరి వాజేడు వద్ద దరికి తగులుతోంది. దీంతో మండల కేంద్రం వద్ద గోదావరి ప్రతీ సంవత్సరం కొంత మేర కోతకు గురవుతోంది. మండల కేంద్రం గోదావరిని ఆనుకొని ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది. గోదావరి వరద నేరుగా రాకుండా వాజేడు వద్ద మధ్యలో ఉన్న చిన్న గడ్డ అడ్డుకుంటుంది. ప్రతీ సంవత్సరం వస్తున్న వరదలకు ఏటా ఆ గడ్డ కూడా కోతకు గురవుతోంది. గతంలో పెద్ద గడ్డ సుమారుగా 400 ఎకరాల మేర ఉండగా గోదావరి వరద నీటితో కోతకు గురై నేడు కానరాకుండా పోయింది. నేడు అక్కడ కేవలం ఇసుక మేటలు మిగిలాయి. ఇప్పుడు చిన్న గడ్డ కూడా తరిగి పోవడంతో మండల వాసుల్లో ఆందోళన నెలకొంది. మండలానికి గోదావరి మూలంగా ఎలాంటి ప్రమాదం జరుగ కుండా ఉండాలంటే లొట్టి పిట్ట గండి నుంచి ఏడ్జర్లపల్లి గ్రామం వరకు గోదావరి ఒడ్డు వెంట కరకట్ట నిర్మించాల్సి ఉంటుంది. కట్ట నిర్మించక పోతే మండలానికి గోదావరి వలన ప్రతీ సంవత్సరం నష్టం జరుగుతూనే ఉంటుందని పలువురు వాపోతున్నారు. అధికారులు, పాలకులు కరకట్ట నిర్మించి ఆదుకోవాలని మండల ప్రజలు, రైతులు కోరుతున్నారు.


కోతకు గురైన భూమి

యూరియా కొరతను నివారించాలి


ఏటూరునాగారం: వినతిపత్రం ఇస్తున్న నాయకులు


గోవిందరావుపేట: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

ఏటూరునాగారం: యూరియా కొరతను నివారించాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల అధ్యక్షుడు సారయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడే దావూద్ మాట్లాడుతూ.. యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పంట పొలాల్లో యూరియా వేయడం ఆలస్యం కావటంతో పంటలు దెబ్బతింటున్నాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో రైతులకు యూరియా అందించాలని అన్నారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిప్రతాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాకూబ్, కాశి, కృష్ణరెడ్డి, వెంకట్ రెడ్డి, నర్సింహులు తదితరులు ఉన్నారు.

సకాలంలో యూరియా అందించాలి

గోవిందరావుపేట: సకాలంలో రైతులకు యూరియా అందించాలని, వడగండ్ల వానకు నష్టపోయిన ప్రతీ రైతుకు నష్ట పరిహారం అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల సమస్యలను పరిష్కరించాలని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా తుమ్మల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో యూరియా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు అని అన్నారు. గుండు రామస్వామి, పురుషోత్తం రెడ్డి, కోటేశ్వరరావు, కృష్ణారావు, సూర్యనారాయణ, యాదిరెడ్డి, లెనిన్, సదానందం, మోటిం సాంబయ్య, నగేష్ పాల్గొన్నారు.

సమస్త జీవులకు ఓజోన్‌తో రక్షణ

- ప్రిన్సిపాల్ రేణుక

ఏటూరునాగారం: ఓజోన్ పొర సమస్త జీవరాశులకు రక్షణ కవచం అని ప్రిన్సిపాల్ రేణుక అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సూర్యుడి నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాల నుంచి ఓజోన్ పొర జీవరాశిని రక్షిస్తుందని అన్నారు. అనంతరం ఓజోన్ పొర క్షీణత వల్ల ఏర్పాడే ప్రభావాలు, నిరోధిక చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో అకాడమి కోఆర్డినేటర్ నవీన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటయ్య, ఐక్య కోఆర్డినేటర్ జ్యోతి తదితరులు ఉన్నారు.


అవగాహన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

- జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌బాబు

ఎస్ఎస్‌తాడ్వాయి: కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఇందిరానగర్‌లో పార్టీ సీనియర్ నాయకుడు పిన్నింటి యాదిరెడ్డి నివాసంలో లివర్ మార్పిడి చికిత్స చేసుకున్న పార్టీ సీనియర్ నాయకుడు పులుసం పురుషోత్తానికి పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రూ.5లక్షల చెక్కు పంపించగా జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అందజేశారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలు ప్రజలకుని అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలిపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, మాజీ ఆత్మచైర్మన్ దుర్గం రమణయ్య, మాజీ జెడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జాజ చంద్రం, నాయకులు చల్ల రజినికర్‌రెడ్డి, అలేటి ఇంద్రారెడ్డి, సిద్దబోయిన శివరాజ్, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జ్ బందెల తిరుపతి పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న లక్ష్మణ్‌బాబు, నాగజ్యోతి

పెద్దల పండుగను నిర్వహించుకోవాలి


ఆలయాన్ని శుద్ధి చేస్తున్న పూజారులు

ములుగు రూరల్: ఆదివాసీల సంస్కృతి, సాంప్రదాయాల మేరకు ఉత్తర కార్తె మొదటి బుధవారం రోజున పెద్దల పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని బాలకుమారస్వామి ఆలయ పూజారులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని అంకన్నగూడెంలో ఆదివాసీ ఆరాధ్యదైవం బాలకుమారస్వామి ఆలయాన్ని శుద్ధి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెద్దల పండుగ సందర్భంగా కులదైవాలకు నైవేద్యం సమర్పించి పెద్దలకు సమర్పించాలని అన్నారు.

జీఓ నంబర్ 64ను రద్దు చేయాలి


సమ్మె శిబిరం వద్ద నాయకులు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్

ఏటూరునాగారం: డైలీవేజ్ కార్మికుల వేతనాలు తగ్గిస్తూ ఇచ్చిన జీఓ నంబర్ 64ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ తెలిపారు. డైలీవేజ్ కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరుతూ చేపట్టిన సమ్మె మంగళవారం ఐదో రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరం ఆయన మాట్లాడుతూ.. ఐదు రోజులుగా కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. డైలీవెజ్ కార్మికులు మరణిస్తే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి రూ.పది లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. నాయకులు దావూద్, నాగలక్ష్మి, జయలక్ష్మి, భాగ్యలక్ష్మి, కమల, స్రవంతి, సమ్మక్క, వసంతతో పాటు తదితరులు ఉన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి


మంగపేట: అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ కల్పన


ఏటూరునాగారం: శిక్షణ ఇస్తున్న సీడీపీఓ ప్రేమలత

మంగపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషకాహారం అందించాలని ఏటూరునాగారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఐసీడీపీఓ కల్పన అన్నారు. మండల కేంద్రంలో ఏసీడీపీఓ కల్పన ఆధ్వర్యంలో మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్ల పోషన్ బీ పడాయి బీ శిక్షణ తరగతుల కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి, విజయకుమారి, బ్లాక్ కోఆర్డినేటర్ ఇమ్మానుయేల్ అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: పుట్టిన ప్రతీ బిడ్డకు పోషణ, చదువు ఎంతో అవసరం అని సీడీపీఓ ప్రేమలత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో శిక్షణ తరగతును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల వయసు గల పిల్లల అందరికీ పౌష్టికాహారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ కల్పన, సూపర్‌వైజర్లు విద్య, పుష్పవతి, వసంత, విజయ, లక్ష్మి కుమారి తదితరులు ఉన్నారు.

సెలవు ఇవ్వాలని వినతి


ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వాజేడు: ఆదివాసీలు సంప్రదాయబద్ధంగా నిర్వహించుకునే కొత్తల (పెద్దల) పండుగ రోజు స్థానిక సెలవును మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వర్లుకు ఆదివాసీ ఉపాధ్యాయులు, ఆదివాసీ సంఘాలకు చెందిన నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉత్తెర కార్తెతొలి వారంలో వచ్చే బుధ, గురువారం రోజున కొత్తల పండుగను నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. గురువారం రోజున కొత్తల పండుగను నిర్వహించుకోవాలని పెద్దలు నిర్ణయించారని ఆ రోజున సెలవును ఇవ్వాలని కోరారు. నాగేశ్వరావు, శ్రీనివాసరావు, జానకి రావు, నరేష్, సురేష్ తదితరులు ఉన్నారు.

మోడల్ స్కూల్‌లో మాక్ పోలింగ్

గోవిందరావుపేట: మండలంలోని చల్వాయి మోడల్ స్కూల్‌లో మంగళవారం ప్రిన్సిపాల్ గండు కుమార్ ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు స్కూల్ హెడ్ బాయ్, హెడ్ గర్ల్, హౌస్ కెప్టెన్ల, వైస్ కెప్టెన్ల ఎన్నికల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎన్నికల ప్రాముఖ్యత, ఓటు విలువను విద్యార్థులకు వివరించారు. కాగా, జిల్లా విద్యాధికారి సిద్దార్థ రెడ్డి తుది దశలో పాల్గొని విజేతల వివరాలు ప్రకటించి ఎన్నిలకను విజయవంతంగా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ మల్లారెడ్డి, ఉపాధ్యాయులు దామెర రాజేందర్, బి వీరకుమార్, శ్రీనివాస్, ఎస్ భవాని తదితరులు పాల్గొన్నారు.


ఓటు హక్కు వినియోగించుకోవడానికి క్యూలో నిలబడిన విద్యార్థులు

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు


మంగపేట: విజేతకు నగదు, ఫొటోను అందజేస్తున్న కమిటీ సభ్యులు

మంగపేట: మండలంలోని బోరునర్సాపురం శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో పూజారి జీడికంటి మధుసూదనాచార్యులు స్వామివారికి అభిషేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. 07 గంటల నుంచి రాత్రి 08 గంటల వరకు ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హేమాచలక్షేత్రంలో..

మండలంలోని శ్రీ హేమాచలక్షేత్రంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి రేవెల్లి మహేశ్ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా శ్రీ వేణుగోపాలస్వామి ఉప ఆలయంలో ఉదయం స్వామివారికి అర్చకులు అభిషేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన యాదవులు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నందోత్సాహాల నడుమ నిర్వహించారు.


వెంకటాపురం(కె): వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉట్లు కొడుతున్న భక్తులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎండోమెంట్ అధికారులు, జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో జాగర శివాజీ, శాంతమూర్తిల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. స్వామి వారి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ సురేష్

వెంకటాపురం(ఎం): మండలంలోని కేశవపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం ములుగు సీఐ దారం సురేష్ ప్రారంభించారు. గ్రామ పెద్దలు, ట్రాక్టర్ యూనియన్, వర్తక వ్యాపారస్తులు, ఉద్యోగుల సహకారంతో గ్రామంలో కెమెరాలు ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. ఆయన వెంట వెంకటాపూర్ ఎస్సై చల్లా రాజు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్యశిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి జ్యోతి

వెంకటాపురం(కె): మండల పరిధిలోని వీరభద్రవరం ఆరోగ్య మహిళాకేంద్రంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అజ్మీరా జ్యోతి 89 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పది మంది వద్ద నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షల కోసం ములుగు ఏరియా వైద్యశాలకు పంపించారు. అనంతరం మహిళలకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది యాకలక్ష్మి, శాంత తదితరులు ఉన్నారు.

ఎంపీడీఓ భద్రునాయక్ బదిలీ

మంగపేట: మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీఓ)గా బాధ్యతలు నిర్వహిస్తున్న భద్రునాయక్‌ను ములుగు డీఆర్‌డీఓ కార్యాలయానికి బదిలీ చేస్తు కలెక్టర్ టీఎస దివాకర మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఎంపీఓగా పనిచేస్తున పాదిల్ల శ్రీనివాస్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తు ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాజకీయ వత్తిళ్ల కారణంగా ఎంపీడీఓ బదిలీ అయినట్లు మండలంలో ప్రచారం జరుగుతోంది. 2011 నుంచి మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగక పోవడం, అప్పటి నుంచి ఇప్పటి వరకు రెగ్యులర్ ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వమించిన వారెవరు ఎక్కువకాలం పనిచేయక పోవడంతో గడిచిన 14 ఏళ్లలో ఎక్కువగా సూపరింటెండెంట్, ఎంపీఓలు, ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరించారని మంగపేటలో రెగ్యూలర్ ఎంపీడీఓలకు కలిసి రావక పోవడమా లేక రాజకీయ నాయకుల సహకరించక పోవడం వలన ఇలా జరుగుతుందా అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

క్లుప్తంగా

ఆర్థిక సాయం



మంగపేట: మండలంలోని రమణక్కపేటకు చెందిన వీర్ల రాంచందర్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మృతుడితో కలిసి రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్న 1887–88 బ్యాచ్‌కు చెందిన స్నేహితులు మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.50,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు ఎడ్లపెల్లి నర్సింహారావు, కొత్త శ్రీనివాసరావు, కొడవలి రఘు, సూరిబాబు, రాంబాబు, రాదాకృష్ణ, ధనలక్ష్మి, విజయలక్ష్మి, మురళి, భానుమతి, ప్రమీలారాణి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

భూముల పరిశీలన



ములుగు రూరల్: జిల్లా కేంద్రం నుంచి జీవింత రావుపల్లి వరకు చేపడుతున్న రోడ్డు వెడల్పులో భాగంగా నష్టపోతున్న భూములను తహసీల్దార్ విజయ్‌భాస్కర్ మంగళవారం పరిశీలించారు. రోడ్డు విస్తీర్ణంలో తమ భూములు కోల్పోతున్నామని పలువురు ఇటీవల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో భూయజమానుతో కలిసి ఆయన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో నిబంధనల మేరకు సెట్‌బ్యాక్ ఉంటుందని తెలిపారు. అంతకంటే ఎక్కువ భూమి నష్టపోయినట్లయితే కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని అన్నారు.

సెకండ్ ఏఎన్ఎంల అరెస్ట్



వెంకటాపురం(ఎం): కలెక్టరేట్ ముట్టడికి వెళ్లనున్న సెకండ్ ఏఎన్ఎంలను వెంకటాపురం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కి తరలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో సెకండ్ ఏఎన్ఎంలు మాట్లాడుతూ.. 16 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగం చేస్తున్న తమను రెగ్యూలర్ చేయాలని ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించిన ఫలితం లేదన్నారు. సమాన పనికి, సమాన వేతనం కల్పించాలన్నారు. అరెస్టు అయిన వారిలో రజిత, కనకలక్ష్మి, సుశీల, స్వప్న, కల్పన, సత్య ఉన్నారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడి

కన్నాయిగూడెం: సేంద్రియ వ్యవసాయంతో రైతులకు అధిక దిగుబడి వస్తుందని మండల వ్యవసాయ అధికారి ముంజ మహేశ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో విల్సన్ అగ్రీ సైన్స్, హారిక ఫర్టిలైజర్ ఆధ్వర్యంలో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముంజ మహేశ్ మాట్లాడారు. రైతులు సేంద్రియ సాగు వైపు మొగ్గు చూపాలన్నారు. సంస్థ ప్రతినిధులు చిట్టిం శ్రీనువాస్, పలనాటి వంశి కృష్ణ, అబ్బు సతీష్,, పల్లా శ్రీనువాస్ పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు



వాజేడు: మండల కేంద్రంలో మంగళవారం గ్రామ పంచాయతీ సిబ్బంది పిచ్చి మొక్కలను తొలగించారు. నాగారం గ్రామ వీధిలో రహదారుల వెంట ఉన్న పొదలను, పిచ్చి మొక్కలను తొలగించి ట్రాక్టర్ ద్వారా డంప్ యార్డుకు తరలించారు. ఈ కార్యక్రమంలో నీలాద్రి, సరబాబు, రాంకీ, మల్లేశ్ ఉన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని 163 జాతీయ రహదారి రొయ్యూర్ సమీపంలో మంగళవారం రాత్రి ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై రాజ్‌కుమార్, సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. బైక్‌పై ఏటూరు నాగారం వస్తున్న కన్నాయిగూడెం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన బొమ్మరాజు రాకేష్, చిగురు మహేశ్‌లకు తీవ్ర గాయాలు అయినట్లు పోలీసులు తెలిపారు. ఏటూరు నాగారం ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం వరంగల్‌కు తరలించినట్లు సమాచారం.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు : 9705748198
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944